**"నాలుగు గోడల మధ్యే ఆమె జీవితం గడిచిపోతుంది. మే మందరమూ కలిసి ఆమెను అలా బంధించామా అనిపిస్తూ ఉంటుంది... బయటి ప్రపంచం ఎలా ఉంటుందో తెలియకుండానే ఆమె చనిపోతుంది... అయినా మా అమ్మ నీ వనుకునేంత చెడ్డదేం కాదు." ఇది తల్లిని గురించి ఓ తనయుడి ఆవేదన!**




"కన్న కూతురిలా చూసుకోమని నిన్ను అడగటంలేదు. కాని ఆమెను రెండు కాళ్ళ జంతువులా చూడవద్దు. ఆమె నీ భర్తకు జన్మనిచ్చిన తల్లి".

"నేనేమీ అలా చేయటంలేదు" రోషంగా అంది సత్యవతి.

"నేను చాలాసార్లు చూశాను సత్యా" నెమ్మదిగా అన్నాడు నారాయణ. "నీకు చాలాసార్లు చెపుదామని కూడా అనుకున్నాను. అది మరింత తగాదాకి దారి తీస్తుందేమోనని ఉపేక్షించాను. కాని ఈ రోజు ఉదయం మా అమ్మను నీ వన్న మాటలు నా చెవిన పడ్డాయి. నాకు బాధ కలిగింది".

"అవును. ఆమెగారు అనే మాటలు మీకు విన్పించవుగా".

"నువ్వేం చదివావ్?" అడిగాడు నారాయణ.

"బి. ఏ. తెలీదా మీకు?" మండిపడింది సత్యవతి.

"మా అమ్మ ఏమీ చదువుకోలేదు".

అతని మాటలకు అడ్డు తగులుతూ అంది సత్యవతి, "చదువుకీ సంస్కారానికీ సంబంధ మేమీ లేదు".

"నిజమే" ఒప్పుకుంటూ అన్నాడు నారాయణ." ముప్పావు వంతు తగాదాలు ఏమీ కాలక్షేపం లేకపోవటం వల్ల వచ్చేవి. నీకు, ఆమెకు చేతి నిండా పని ఉంటే మీకు తగాదా పడే ఓపికే ఉండదు".

"దానికీ, చదువుకీ సంబంధ మేమిటి?" అడిగింది సత్యవతి.

"అక్షర జ్ఞానం లేని ఆమెకు ఏమీ తోచదు. ఉదయం లేచిన దగ్గర్నుంచీ, పడుకునే వరకు ఆవిడ ఏదో విధంగా కాలక్షేపం చేయాలి".

"హాయిగా కృష్ణా రామా అనుకుంటూ కూర్చోవచ్చు గదా? మామయ్యగార్ని చూడండి".

"మామయ్యగారు బయటి ప్రపంచం తెలిసిన వ్యక్తి. ఉండేది కొడుకు ఇంట్లోనైనా ఆయన హద్దులు ఆయనకు తెలుసు. ఉద్యోగం చేసిన వ్యక్తి, ఆయనక్కూను అమ్మకూ పోలికేమిటి?"

"మీ అమ్మగారిక ఎంతయినా అహం ఎక్కువే. అత్తగారి హోదాను చూపుదామనుకుంటుంది."

"నీకూ పొగరు ఎక్కువే" కఠినంగా అన్నాడు నారాయణ" ఆమె నీకు సలహాలు ఇచ్చే స్థాయిలో లేదనుకుంటావు".

"అన్నిటికీ నన్నే అంటారేం?" అరిచినట్లుగా అంది సత్యవతి, "ఒక్కసారి... ఒక్కసారంటే ఒక్కసారి మీ అమ్మ దగ్గరకు వెళ్ళి హాయిగా కృష్ణా రామా అనుకుంటూ కూర్చోరాదే, దాని పని అది చేసుకుపోతుందని చెప్పారా?"

"చెప్పలేదు. చెప్పను". మంచం మీద నుంచి లేచి కిటికీ దగ్గరికి వెళ్లి, బయటకు చూస్తూ అన్నాడు.

"ఏం?, ఎందుకని?"

"మా అమ్మంటే నాకు జాలి". ఇటు వైపు తిరగకుండానే సమాధాన మిచ్చాడు నారాయణ" మీ అందరిలాగా ఆమె చదువుకోలేదు. ఈ కాలపు

# వెలుగులోకి

ఆదిరాజు వేణుగోపాల్

ఆడ పిల్లల లాగా ఆమె కూడా చదువుకుని ఉంటే బాగుండేదని చాలాసార్లు అనిపిస్తూ ఉంటుంది. నాలుగు గోడల మధ్య ఆమె జీవితంలో ఎక్కువ భాగం గడిచిపోయింది. మేమందరమూ కలసి ఆమెను అలా బంధించామా అని అన్పిస్తూ ఉంటుంది నాకు. ఈమె జీవితం ఇలా గడిచిపోయిందేమిటా అన్న బాధ ముల్లులా గుచ్చుకుంటూ ఉంటుంది. బయటి ప్రపంచం ఎలా ఉంటుందో తెలియకుండానే ఆమె చనిపోతుంది. నిశ్శబ్దంగా ఈ జీవిత నాటక రంగం నుంచి తప్పుకుంటుంది.''

''మరి నీవో? ఆమె జీవితం కన్నా నీ జీవితం చాలా చైతన్యవంతమయింది. పుస్తకాలు చదువుతావు. రాజకీయాల పట్ల ఆసక్తి చూపుతావు. స్పోర్ట్స్ పేజి అక్షరం విడువకుండా చదువుతావు. స్నేహితురాలితో కలిసి షాపింగ్ వెళ్లగలవు. ఏ విషయాన్నయినా సమర్థించగలనన్న ఆత్మవిశ్వాసం నీకు ఉంది. నీతో పోల్చుకుంటే ఆమె ఎక్కడ? విశాల హృదయంతో అర్థం చేసుకుని ఓపిక పట్టమనే నిన్ను అడుగుతున్నది''.

''కొడు గా మీ కామె మీద ప్రేమ ఉండవచ్చు. చేసుకున్నందుకు నా తరపున వారించాల్సిన బాధ్యత మీకు లేదా?'' సత్యవతి కోపంగానే అడిగింది.

''లేదనటం లేదుగా!'' ఇటు తిరిగి భార్య కేసి చూశాడు నారాయణ ''ఇంత వివరంగా నీకు చెబుతున్నానంటే నీవు అర్థం చేసుకోగలవన్న ఆశ. చదువుకొన్న దానివి కాబట్టీ కొద్దో గొప్పో ఆలోచించగలవన్న నమ్మకం. ఇదే మా అమ్మకు చెబితే ఒక్క ముక్కా ఆమెకు అర్థం అయేది కాదు. అసలు ఆలోచించగల శక్తి ఆమెకు ఉందా అన్నదీ అనుమానమే. సమస్యలకు స్పందించి, వాటి గురించి ఆలోచించే అవకాశం మేమెన్నడూ ఆమెకు కలుగనీయలేదు. పైగా నువ్వే నన్ను తన మీదికి ఉసిగొల్పావని అనుకుంటుంది. అది మనసులో పెట్టుకుని మళ్ళీ తగాదాలు, ఏడ్పులు. ఇంటి వాతావరణం ఎప్పుడూ ఇలా ఉంటే ఇంట్లో నేనెలా ఉండగలను? అయినా మా అమ్మ నీవనుకునేంత చెడ్డదేమీ కాదు''.

''మీరనుకునేంత మంచిదేమీ కాదు'' వెంటనే సమాధానం ఇచ్చింది సత్యవతి.

మనసు చివుక్కు మంది నారాయణకి. కోపాన్ని నిగ్రహించుకుంటూ అన్నాడు''. సహనం కోల్పోయి కొట్లాడుకునే స్థితికి వస్తున్నాము. అందుకే ఈ విషయం నీతో కదపకూడదనుకున్నాను''.

''గొడవెందుకు? మీరెలా చెబితే అలా చేస్తాను'' పొడిగా అంది సత్యవతి ''నేను మీ ఇంట్లో బానిసని''.

''చాలా పొరబడుతున్నావ్. బానిసవయితే నిన్నింతగా అడిగేవాణ్ణి కాదు. మరోసారి నోరు తెరవకుండా బాదేవాణ్ణి.''

సత్యవతి కళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

''ఏడవకు సత్యా!'' చటుక్కున భార్యను సమీపించి దగ్గరికి తీసుకుంటూ అన్నాడు నారాయణ. ''నేను నిన్నేదో అంటున్నానని పొరపడుతున్నావ్. మా అమ్మ వచ్చినా ఈ ఇంటి యజమానురాలివి నీవే. యజమానురాలిగా ఇల్లు ప్రశాంతంగా ఉండటానికి ఏం చర్యలు తీసుకుంటావో నీ ఇష్టం''.

మాట్లాడలేదు సత్యవతి.

''వాళ్ళు మన స్వేచ్ఛని హరించారని నీవు అపోహపడటంలో తప్పు లేదు. చాలా మంది కోడళ్ళు అలాగే ఫీలవుతారు. ఈ దశను దాటి మనం ప్రశాంతంగా బ్రతకాలని నా కోరిక. అది మన చేతుల్లోనే ఉంది. ముఖ్యంగా నీ చేతుల్లో...''

అప్పటికీ మాట్లాడలేదు సత్యవతి. ఇంకేమీ మాట్లాడలేదు నారాయణ కూడా.

** ** **

పైకి చెప్పకపోయినా భర్త మాటలను గౌరవించింది సత్యవతి. ఆ ఓపిక ఆమెకు కొద్ది రోజులు మాత్రమే ఉంది. ఒక రోజు నారాయణ ఆఫీసు నుంచి వచ్చేసరికి తిరిగి ఇద్దరూ ఎడముఖం, పెడముఖంగా కనిపించారు. తండ్రి బయటికి వెళ్ళాడు.

అతను కుర్చీలో కూర్చోగానే మొదలుపెట్టింది తల్లి.

''మన తగాదాలు ఎప్పుడూ ఉండేవే' అడ్డు తగులుతూ కోపంగా అంది సత్యవతి ''ఆయన్ని కాసేపు ప్రశాంతంగా కూర్చోనీయండి''.

''నా కొడుకుతో నా ఇష్ట మొచ్చినప్పుడు మాట్లాడతాను'' తగ్గలేదు ఆవిడ.

విడిగా ఎంత పోట్లాడుకున్నా భర్త ఎదురుగా అత్తగారితో పోట్లాడే ధైర్యం లేదు సత్యవతికి. కాఫీ కలపటానికి లోపలి కెళ్ళిపోయింది. పిల్ల లిద్దరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు.

తల్లి చెప్పిందంతా ప్రశాంతంగా విన్నాడు. ఆ తర్వాత లేచి వంటింట్లోకి వెళ్ళాడు. నిశ్శబ్దంగా కాఫీ సత్యవతి అందించింది.

చిన్నగా నవ్వుకుని, కాఫీ గ్లాసు అందుకుని బయటికి నడిచాడు.

** ** **

ఆ రాత్రి శర్మగారి ఇంటికి వెళ్ళాడు.

''మాష్టారూ, మీరు నాకో సాయం చేయాలి''.


''చెప్పు''.

''మా అమ్మకి చదువు చెప్పాలి''.

''మీ అమ్మగారికా?'' ఆశ్చర్యంగా అన్నారాయన.

''మా అమ్మకు అక్షర జ్ఞానం లేదు మాస్టారూ. ఆ ఆడపిల్లకి చదువు అక్కర్లేదని చీకటిలోకి తోశారు ఆమెను. ఆ తరంలోని మనిషికి మీరు చదువు చెప్పాలి. బొమ్మలు చూసి పత్రికను పక్కన పడేసే వ్యక్తిని, ఆ పత్రికను చదివేలా మీరు చేయాలి. చీకట్లోని మనిషిని వెలుతురులోకి తీసుకురావాలి. ఆమెకూ కాలక్షేపం అవుతుంది''.

ఆ మాటలు అంటుంటే అతని గొంతు వణికింది. తనకు చదువు రాకపోయినా బిడ్డల చదువుకు ఆమె ఆరాటపడింది. ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టినా చదువు దగ్గర మాత్రం గారాబం చేసేది కాదు. తన పుస్తకాలను ఎంతో అప్యాయంగా పట్టుకుని, అప్పుడప్పుడూ 'ఇదేం అక్షరం. ఇదేం అక్షరం' అడిగేది.






అటువంటి దృశ్యాలు ఇప్పటికీ తన గుండెల్లో పదిలంగా ఉన్నాయి. వయసులో ఉన్నప్పటి ఆ సున్నితత్వం ఆమెలో ఇప్పుడు ఉండకపోవచ్చు. చదువు లేని తల్లిని ఒక మాటా అనలేదు.

"చెప్తారా మాస్టారూ?" ఆలోచనల నుంచి తేరుకుంటూ అడిగాడు.

"తప్పకుండా" గంభీరంగా అన్నారు శర్మ "రేపు సాయంకాలం ఆరు గంటలకి".

ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుని, కాన్వెంటు నడుపుతున్న ఓ స్నేహితుడి దగ్గరికి వెళ్ళాడు.

"ఊరికే రారు మహాత్ములు" కుర్చీ చూపెడుతూ అన్నాడా స్నేహితుడు.

"పని మీదే వచ్చాను" కూర్చుంటూ అన్నాడు నారాయణ" నా శ్రీమతికి ఉద్యోగం ఏదన్నా దొరుకుతుందా?"

"ఎప్పట్నించి పంపిస్తావ్?" అడిగాడు స్నేహితుడు.

"ఖాళీ ఉందా?" ఆశ్చర్యంగా, ఆనందంగా అన్నాడు నారాయణ.

"ప్రైవేట్ స్కూల్సులో టీచర్సు వస్తూ ఇంటారు., పోతూ ఉంటారు. న న్నెనే ఒకావిడ వెళ్ళిపోయింది." నవ్వుతూ అన్నాడతను.

అతడు తెప్పించిన టీ తాగి ధన్యవాదాలు చెప్పి రెండు మూడు రోజుల్లో పంపిస్తానని చెప్పి బయట పడ్డాడు నారాయణ. కొట్లో పలకా, బలపాల పాకెట్టు కొని సరాసరి ఇంటికెళ్ళాడు.

"పలకెవరికి నాన్నా" ఏడో తరగతి చదువుతున్న నిర్మల అడిగింది.

"ఇదిగో, ఈవిడకి" తల్లి ఒడిలో పలకా, బలపాలు పెడుతూ అన్నాడు నారాయణ.

పిల్లలిద్దరూ పక పకా నవ్వారు. సత్యవతి కూడా కోపం మరిచిపోయి నవ్వింది. అదేమి పట్టించుకోకుండా తండ్రితో అన్నాడు నారాయణ." అమ్మకు చదువు చెప్పించాలని ఎప్పట్నుంచో నాకు కోరిక. మనందరమూ చదువుకొన్నవాళ్ళమై కూడా, అమ్మకి ఎవరమూ చదువు చెప్పటానికి ప్రయత్నించలేదు. ఈ వయసులో ఇప్పుడు మన మాట వినదు. అందుకే శర్మగారికి చెప్పాను." ఆయన రేపు రమ్మన్నారు."

నారాయణ తండ్రిఏమీ మాట్లాడలేదు. తల్లి మాత్రం ఇప్పుడు నాకు చదువేమిటంటూ సిగ్గు పడింది. ఒక పట్టాన ఒప్పుకోలేదు.

రాత్రి అందరు పడుకున్న తర్వాత ఉద్యోగ విషయం చెప్పాడు సత్యవతికి. ఆశ్చర్యపోయింది సత్యవతి. ఒకప్పుడు సరదాపడితే వద్దన్నాడు. ఇప్పుడు తనే వెళ్ళమంటున్నాడు.

"పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు" బొంకాడు నారాయణ.

"వేన్నీళ్ళకి చన్నీళ్ళు తోడు. నీ ఇష్టం. అయితే నీ మీద విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని మాత్రం మరచిపోవద్దు".

"సరే"నంది సత్యవతి. భర్త ఇద్దరికీ పనులు కల్పిస్తున్నాడన్న ఊహ రాలేదు ఆమెకు. తన తల్లి కూడా చదువుకోబోతుందన్న ఊహ అతని కెంతో తృప్తి నిచ్చింది.

మరుసటి రోజు ఉదయం సత్యవతి ఉద్యోగ విషయం మరో షాక్ ఇంట్లో వాళ్ళకి. కూతుర్ని కొడుకుని దగ్గరికి పిలిచి చెప్పాడు నారాయణ.

"ఈ రోజు నుంచి కొన్ని పనులు మీ అంతట మీరు చేసుకోవాలి. ఎందుకంటే అమ్మ కూడా ఉద్యోగానికి వెళ్తున్నది కాబట్టి".

తలూపారు ఇద్దరూ. ఒకప్పుడు ఇద్దరూ వంతులు వేసుకునేవారు. ఇప్పుడు ఒక పక్క సత్యవతి స్కూలుకి రెడీ అవుతుంటే తల్లి చకచకా అన్ని పనులూ అందుకోవటం చూసి తృప్తిగా నిట్టూర్చాడు నారాయణ. ఆ సాయంకాలం కోడలు స్కూలు నుంచి రాగానే తనే కాఫీ కలిపి ఇచ్చింది ఆవిడ.

ఆరు గంటలవుతుండగా నారాయణ వచ్చాడు. తల్లి ఇంకా తయారు కాకపోవటం చూసి కేకలు వేశాడు. బయలుదేరమని తొందర పెట్టాడు. పలకా, బలపం పైకి కనిపించకుండా చేతి సంచిలో వేసి పట్టుకున్నాడు. తను తీసుకెళ్తానని ఉత్సాహపడ్డాడు రాజు.

"రేపట్నుంచి ఆ డ్యూటీ నీదే!" కొడుక్కి హామీ ఇచ్చాడు నారాయణ.

సిగ్గుపడుతున్న తల్లిని చూసి అన్నాడు. "శర్మగారు మనకు తెలియనివారా ఏమిటి? పద పద..."

బలవంతం మీద కొడుకు వెంట నడిచింది ఆవిడ. శర్మ ఇంట్లో మరో స్త్రీ అక్షరాలు దిద్దుతున్నది. ఆమె శర్మగారి భార్య. ఆడవాళ్ళు ఒకర్నొకరు చూసుకుని సిగ్గు పడ్డారు. నారాయణతో పాటు బయటికి వచ్చారు శర్మ.

"మాస్టారూ!"

"అవును" గంభీరంగా అన్నాడు శర్మ. "నీవు మీ అమ్మ చీకట్లో ఉండిపోయిందని బాధ పడ్డావు. మరి నా భార్య కూడా ఆ చీకట్లోనే ఉండిపోయిందని ఇంత కాలమూ తెలుసుకోలేకపోయాను. టీచర్నయి కూడా. నేను చాలా తప్పు చేశాను నారాయణా! నేను కూడా నా భార్యను వెలుగులోకి తీసుకురావాలి కదా!'

నారాయణ ఆయన వంకే చూస్తుండిపోయాడు.

బుగ్గల మీద నుంచి జాలువారుతున్న కన్నీటిని తుడుచుకునే ప్రయత్నమేమీ చేయలేదు ఆయన.

★

